అక్రమార్కులు ఊచలు లెక్కించాల్సిందే: మంత్రి సత్యకుమార్

తాడిమర్రి, న్యూస్‌టుడే: జగన్‌మోహన్‌రెడ్డి నిర్బంధ నియంతృత్వ పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభించిందని, వారి ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. గురువారం తాడిమర్రి మండలంలో పలు గ్రామాల్లో మంత్రి సత్యకుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా తాడిమర్రిలో ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత వైకాపా పాలనలో రాష్ట్రం అన్ని రకాలుగా అధోగతిపాలైందని, పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి తన అక్రమ సామ్రాజ్యాన్ని విస్తరించుకుని, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసాడని విమర్శించారు. అక్రమాలకు పాల్పడిన వైకాపా నాయకులు ఊచలు లెక్కించాల్సిందేనని, జైలు జీవితం ప్రశాంతంగా గడిపేలా చేస్తామని మంత్రి వివరించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాటమయ్య, ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి, తెదేపా మండల కన్వీనర్ కూచి రాము తదితరులు పాల్గొన్నారు.

గుడ్‌మార్నింగ్ పేరుతో దోచేసిన కేతిరెడ్డి

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఓడిపోయినా.. ఇంకా బుద్ధిరాలేదని, ప్రశాంతంగా ఉన్న ధర్మవరంలో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. గుడ్‌మార్నింగ్ పేరుతో కేతిరెడ్డి చేసిన అక్రమాలు వెలికితీసి, ఆయన నిర్మించుకున్న గుర్రాలకోట బద్ధలుకొడతామని ప్రకటించారు. తాడిమర్రి ప్రధాన రహదారి విస్తరణ పేరుతో ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం అందజేస్తామని మంత్రి వివరించారు.



తాడిమర్రిలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ఈ-నేత్ర.. మూత

రాయదుర్గం పట్టణం, ఉరవకొండ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి ఈ-నేత్ర కేంద్రాలు మూతపడ్డాయి. 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో జిల్లాలోని అన్ని సీహెచ్‌సీల్లో పది కేంద్రాలను ప్రారంభించారు. ఈనెల 4వ తేదీతో రాష్ట్ర ప్రభుత్వం, అపోలో ఆసుపత్రి మధ్య ఒప్పందం గడువు ముగిసింది. దాంతో సేవలు నిలిచిపోయాయి. ఈ కేంద్రాల్లో రోజూ 50 మందికి పైగా చికిత్సలు పొందేవారు. అవసరమైన వారికి కళ్లద్దాలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ కేంద్రాలు తెరచుకోక పోవడంతో నేత్ర సంబంధ వ్యాధులతో వచ్చిన రోగులు వెనుదిరుగుతున్నారు. ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా 2,64,818 మంది కంటి చికిత్సలు పొందినట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. కంటి చికిత్సలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ రూ.200 అవుతుంది. కళ్లద్దాలు కావాలంటే మరో రూ.2,000 అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఫలితంగా పేదలపై భారం పడనుంది. కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాలను పునఃప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

గడువు ముగియడంతోనే..

- జగన్‌మోహన్, జిల్లా మేనేజర్, ఈ-నేత్ర కేంద్రం

ప్రభుత్వం-అపోలో ఆసుపత్రి మధ్య ఒప్పందం ముగియడంతోనే కేంద్రాలను మూసేశాం. ఎప్పుడు ప్రారంభిస్తారనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఆ మేరకు మళ్లీ సేవలు ప్రారంభమవుతాయి.



రాయదుర్గంలో మూతపడిన కేంద్రం

సీహెచ్‌సీల వారీగా చికిత్స పొందిన రోగుల సంఖ్య

ధర్మవరం	35,735
కళ్యాణదుర్గం	31,013
మడకశిర	26,758
పెనుకొండ	31,596
రాయదుర్గం	21,703
శింగనమల	24,349
తాడిపత్రి	27,564
ఉరవకొండ	25,971
సీకే పల్లి	20,283
నల్లమాడ	19,840

స్వామీ.. రక్షణేదీ?

- దేవాలయాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- ఆందోళన కలిగిస్తున్న చోరీలు, ఘటనలు

ఈనాడు డిజిటల్, అనంతపురం –న్యూస్‌టుడే, ఉరవకొండ

ఉమ్మడి జిల్లాలో ఆలయాలకు రక్షణ లేకుండా పోతోంది. అధికారుల నిర్లక్ష్యం.. భద్రతా వైఫల్యాలను అవకాశంగా మలుచుకుంటున్న దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. ఆలయాలను నుంచి వచ్చే ఆదాయాన్ని వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల కణేకల్లు మండలం హనకనహాళ్‌లో సీతారాముల ఆలయ రథానికి నిప్పు పెట్టడంతో మరోసారి భద్రతా వైఫల్యాలు బహిర్గతమయ్యాయి. దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలకే రక్షణ కరవైనప్పుడు ఇతర దేవస్థానాల పరిస్థితి ఏంటని భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆలయాల నుంచి ప్రభుత్వానికి రూ.కోట్లల్లో ఆదాయం వస్తున్నా రక్షణ చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భక్తుల తాకిడి అధికంగా ఉండే ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లోనూ సీసీ కెమెరాలు పని చేయకుండా ఉండటం ఆ శాఖ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. దీంతో ఆలయాలను లక్ష్యంగా చేసుకుంటున్న దొంగలు వరుస చోరీలకు పాల్పడుతున్నారు.



గత తెదేపా ప్రభుత్వంలో నిఘా నేత్రాల ఏర్పాటు

ఉమ్మడి అనంత జిల్లాలో గత తెదేపా ప్రభుత్వ హయాంలో ముఖ్య ఆలయాలన్నింటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక నిఘా వ్యవస్థ సైతం ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో ఆలయాల వద్ద భద్రతను పెంచారు. అప్పట్లోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 170 ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆలయాల్లో భద్రతా పర్యవేక్షణను గాలికొదిలేసింది. ప్రస్తుతం 40 ఆలయాల్లో మాత్రమే సీసీ కెమెరాలు పని చేస్తున్నాయి. భద్రతను దేవాదాయ శాఖ పూర్తిగా గాలికొదిలేసింది. ఉమ్మడి జిల్లాలో ఆలయాల వివరాలు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు తెలియకపోవడం గమనార్హం. ఎన్ని చోట్ల సీసీ కెమెరాలు ఉన్నాయి? వాటిలో ఎన్ని పనిచేస్తున్నాయో కనీస సమాచారం తమ వద్ద లేదని చెప్పడం ఆ శాఖ నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తోంది.

ఏడాది కిందట కసాపురం ఆలయంలో దుండగులు చేతివాటం చూపిస్తూనే ఉన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల పర్సులతో పాటు ద్విచక్రవాహనాలు తరచూ చోరీకి గురవుతున్నాయి. సీసీ కెమెరాల నిఘా వ్యవస్థలో లోపాన్ని చోరులు అవకాశంగా తీసుకుంటున్నారు. ఏడాది కిందట ఆలయ రక్షణ విభాగం ఇన్‌ఛార్జే హుండీలో నగదు తస్కరించాడు.

తనకల్లు మండలం తవలం ఆంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. వాటి నిర్వహణ కరవైంది. ఆలయానికి భద్రత కొరవడిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

గోరంట్లలోని వినాయక ఆలయంలో ఏడాదిన్నర కిందట స్వామివారి కిరీటం దొంగతనానికి గురైంది. పోలీసులు నిందితుడిని గుర్తించి కిరీటాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని భక్తులు డిమాండ్ చేయడంతో అందుబాటులోకి తెచ్చారు.

హిందూపురం పట్టణంలోని అనంత పద్మనాభస్వామి ఆలయంలో ఏడాది కిందట దొంగలు బసవన్న విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. ఆ సమయంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు వారిని పట్టుకోలేదు.



తనకల్లులోని తవలం ఆంజనేయస్వామి ఆలయం

గుప్త నిధుల వేటలో..

ఉమ్మడి జిల్లాలోని పురాతన ఆలయాల్లో గుప్త నిధుల వేట ఇంకా కొనసాగుతూనే ఉంది. ఏటా కేసులు నమోదవుతున్నా వాటి నివారణకు కనీస చర్యలు తీసుకోవడం లేదని భక్తులు విమర్శిస్తున్నారు. గుత్తి, కళ్యాణదుర్గం, హిందూపురం, పుట్టపర్తి, కళ్యాణదుర్గం, ఉరవకొండ, పెనుకొండ, మడకశిర ప్రాంతాల్లోని పురాతన ఆలయాలను లక్ష్యంగా చేసుకుంటున్న దుండగులు గుప్త నిధుల కోసం నిర్మాణాలను ధ్వంసం చేస్తున్నారు. పలు ఆలయాల్లో విగ్రహాలను ఎత్తుకెళ్లి.. నిధుల వేట కొనసాగిస్తున్నారు. ఆలయాల బయట ఉన్న రథాలకూ రక్షణ లేకుండా పోయింది.

భద్రత పటిష్ఠం చేస్తాం..

- వి.రత్న, ఎస్పీ, శ్రీసత్యసాయి

జిల్లాలో ఏయే ఆలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి? పని చేస్తున్నాయా.. లేదా అనేది ప్రభుత్వానికి నివేదిక ఇస్తున్నాం. అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేస్తాం. ఆలయాల్లో భద్రత మరింత పటిష్ఠం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. రాత్రి వేళల్లోనూ గస్తీ ఏర్పాటు చేస్తాం.

అంతర్గత పైపులైనుతో

గొల్లపల్లి నుంచి ఏర్పాటుకు రంగం సిద్ధం

పురంలో ఇంటింటా తాగునీరు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణానికి మంచి రోజులు వస్తున్నాయి. ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించబోతోంది. 2050 నాటికి పెరిగే జనాభాకు, అప్పటి అవసరాలకు అనుగుణంగా శాశ్వత పథకాలకు రూపకల్పన జరుగుతోంది. ఇందులో భాగంగా పట్టణంలో ఇంటింటికీ తాగునీటిని అందించేందుకు బృహత్ ప్రణాళిక సిద్ధమైంది.

- **జనాభా:** 1.71 లక్షలు
- **రోజు అవసరమయ్యే నీరు:** 26 మిలియన్ లీటర్లు
- **ప్రస్తుతం సరఫరా:** 13 మిలియన్ లీటర్లు.
- **ఎదురవుతున్న సమస్య:** మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతోంది. పైప్‌లైన్ సరిగా లేకపోవడంతో ఆటోనగర్, రహమత్‌పురం, సీపీఐ కాలనీ, బైపాస్ రోడ్, ఆర్టీసీ కాలనీ, త్యాగరాజ్ నగర్ తదితర ప్రాంతాలకు వారం రోజులకు ఒక్కసారే నీరు ఇస్తున్నారు.

రూ.120 కోట్లతో అంచనాలు..

పట్టణంలో 30 ఏళ్లుగా నెలకొన్న నీటి సమస్యకు ఎమ్మెల్యే బాలకృష్ణ ఐదేళ్ల కిందట పరిష్కారం చూపారు. పట్టణానికి ఏడాదికి 0.3 టీఎంసీ నీరు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పట్టణ సమీపంలోని కొట్నూరు వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌కు చేరుతుంది. అక్కడి నుంచి పట్టణానికి సరఫరా చేయడానికి సరైన పైపులైన్ వ్యవస్థ లేక తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీన్ని అధిగమించేందుకు అంతర్గత పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు రూ.120 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఇటీవల ఈ అంశాన్ని బాలకృష్ణ... ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు తీసుకెళ్లారు. దీంతో తగిన చర్యలు తీసుకోవాలని పురపాలక శాఖను సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రతిపాదనలను పరిశీలించిన పురపాలక శాఖ సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారు చేయించాలని కన్సల్టెన్సీలను సూచించింది. మరోవైపు ఈ పనులకు కేంద్రం నుంచి అమృత్ పథకం కింద నిధులను రాబట్టేందుకు పురపాలక శాఖ రంగం సిద్ధం చేస్తోంది.

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి రహదారుల భద్రత కమిటీ సమావేశం జరిగింది. ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపేవారిమీద కేసులు నమోదు చేసి జైలు శిక్ష పడేట్టు చేయాలన్నారు. ప్రమాదాలు తరచుగా జరిగే ప్రాదేశాలను ఒక కమిటీ ద్వారా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెనుకొండలోని ట్రామా కేర్ సెంటర్‌లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీ ప్రదాన కూడళ్లలో ప్రమాదాలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాసులు, జిల్లా రవాణా అధికారి కరుణసాగర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారిణి మంజువాణి, డీసీహెచ్‌వో తిప్పేంద్రనాయక్, డీఈవో మీనాక్షి, ఆర్ అండ్‌బీ ఈఈ సంజీవయ్య, జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఆర్డీఓల బదిలీ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో కీలకమైన అధికారులను బదిలీ చేస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని మొత్తం ఏడుగురు ఆర్డీఓలు బదిలీ కావడం విశేషం. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి బదిలీ చేయడం ఇదే ప్రథమం. అనంతపురం ఆర్డీఓగా కేశవనాయుడు, కళ్యాణదుర్గంకు వసంతబాబు, గుంతకల్లుకు ఏబీవీఎస్‌డీ శ్రీనివాస్, కదిరి ఆర్డీఓగా వీఎస్ శర్మ, పెనుకొండకు ఆనంద్‌కుమార్, ధర్మవరానికి మహేశ్, పుట్టపర్తి ఆర్డీఓగా పి.సువర్ణను నియమించారు. కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణి సుస్మిత కొవ్వూరు డివిజన్‌కు, కదిరి ఆర్డీఓ సన్ని వెంకటేశ్ కావలి డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాలోని ఇతర డివిజన్లలో పని చేస్తున్న ఆర్డీఓలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. అనంత ఆర్డీఓగా నియమితులైన కేశవనాయుడు గతంలో జిల్లాలో అనేక హోదాల్లో పని చేశారు.

యాదాటికి లేరు సాటి!

- ☛ ఆధ్యాత్మిక సేవలో ఆచార్య
- ☛ వరించిన కర్ణాటక ప్రభుత్వ పురస్కారం

హిందూపురం సాంస్కృతికం, గ్రామీణం, న్యూస్‌టుడే

యాదాటి నరహరి.. పేరులోనే కాదు సేవల్లోనూ ఆయనకు ఎవరూ లేరు సాటి.. చిన్నప్పటి నుంచే చదువుల్లో ప్రతిభ కనబరుస్తూ ఉన్నత ఉద్యోగం చేస్తూనే ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీనరహరి సద్గురు ఆశ్రమం సేవకుడిగా అందరి మన్ననలు పొందారు. ఆయన సేవలను గుర్తించి గురువారం కర్ణాటక ప్రభుత్వం సర్ మోక్షగుండం విశ్వేశరయ్య పురస్కారాన్ని అందజేసింది.



కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న నరహరి

విద్యాభ్యాసం.. ఉద్యోగం ఇలా..

ఆశ్రమ వ్యవస్థాపక పీఠాధిపతి దివంగత యాదాటి సింహాద్రిశాస్త్రి, నాగవేణమ్మలకు ఆరో సంతానం నరహరి. ఈయన స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1969-74వరకు ఆరోతరగతి నుంచి పది వరకు విద్యనభ్యసించి అత్యుత్తమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. బెంగళూరులోని ఐఐఎస్‌సీలో 1982లో బీఈ, 1984లో ఎంఈ, 1987లో పీహెచ్‌డీ పట్టాను స్వర్ణ పతకంతో సాధించారు. విద్యాభ్యాసం తర్వాత 1987లో ఆశ్రమ సేవకుడిగా పనిచేసి ఆధ్యాత్మిక భావనకు శ్రీకారం చుట్టారు. ఉద్యోగం వచ్చాక బెంగళూరు వెళ్లారు. 1988 నుంచి ప్రాధ్యాకుడిగా సేవలందిస్తూ అందరి ప్రశంసలు పొందారు. పతిష్ఠాత్మక భారతీయ విజ్ఞాన మందిరం (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్) కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రస్తుతం గౌరవ ఆచార్యులుగా పని చేస్తున్నారు. ఇప్పటివరకు 29మంది పీహెచ్‌డీ విద్యార్థులను తయారు చేశారు. గతంలో జేసీ బోస్ ఫెలోషిప్, ఐఈఈఈ ఫెలోషిప్, ఆర్మీ బాబా ఫెలోషిప్ లాంటి అవార్డులు యాదాటికి లభించాయి. వృత్తి ధర్మం పాటిస్తూనే ఆధ్యాత్మిక సేవలను కొనసాగిస్తూ ఆశ్రమ నిర్వహణకు కృషి చేశారు.

ముఖ్యమంత్రి చేతుల మీదుగా..

సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో కర్ణాటక ప్రభుత్వం 'సర్ మోక్షగుండం విశ్వేశరయ్య' పురస్కారాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతులమీదుగా బెంగుళూరులోని జేఎన్ టాటా ఆడిటోరియంలో గురువారం రాత్రి అందుకున్నారు. ఆయనను ఆశ్రమ ప్రతినిధులు హనుమంతరాజు, ప్రముఖులు నంబూరి శంకర్, తదితరులు అభినందించారు.

జనులారా.. తిలకించండి కనులారా!

➡ సమీపానే సుందర ప్రాంతాలు ➡ నేడు పర్యాటక దినోత్సవం

★ పర్యాటక ప్రాంతం ● ప్రత్యేకత
■ అనంతపురం నుంచి ఎంత దూరం ✦ రవాణా సాకర్యం

జీవన గమనంలో నిత్యం ఎన్నో పనులతో అలసిపోతున్న శరీరాలకు కాసింతైనా ఆటవిడుపుందా.. కొత్తగా ఆలోచిస్తున్నామా.. ఎక్కడికైనా వెళ్తున్నామా.. ప్రత్యేక ప్రాంతాలను తెలుసుకుంటున్నామా? అలా చేయకపోతే ఇక నుంచైనా సమయం వెచ్చించి.. కొత్త ప్రదేశాలను చూసి ఆహ్లాదాన్ని ఆస్వాదించాలని ఉందా.. అయితే ఈ కథనం మీకోసమే.. ఎక్కడో సుదూరాన ఉండే ప్రదేశాలే కాదు.. తక్కువ ఖర్చు, మన చుట్టూనే ఉన్న పర్యాటక ప్రాంతాల వైపు ఓ కన్నేయండి. పొద్దున వెళ్లి సాయంత్రానికి తిరిగి వచ్చేలా.. ఆధ్యాత్మిక, పర్యాటక, వైజ్ఞానిక ప్రాంతాలను చుట్టిరండి. పిల్లాపాపలతో సందర్శించి, విశిష్టతలను కనులారా తిలకించి అనుభూతులను మనసు నిండా నింపుకోండి మరి.

మదిని దోచే నందికొండ



★ నందికొండ

● నందికొండపై ఆకాశం నుంచి సన్నగా పడే చినుకులు.. దట్టమైన పొగమంచు మదిని దోచేస్తుంది. కొండపై నుంచి సూర్యోదయాన్ని తిలకించడం ఓ మధురానుభూతిని మిగుల్చుతుంది. తెల్లవారుజామున 5 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సందర్శించవచ్చు. ఎక్కువ మంది సూర్యోదయాన్ని తిలకించేందుకు ఇష్టపడతారు. శని, ఆదివారాల్లో సందడిగా ఉంటుంది.

■ 185 కి.మీ.

✦ చిక్కబళ్లాపూర్ వరకు బస్సుల్లో వెళ్లొచ్చు. అక్కడి నుంచి ప్రైవేటు ట్యాక్సీలు, బస్సులు ఉంటాయి. సొంత వాహనాల్లో నేరుగా చేరుకోవచ్చు.

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

సహజ సంపద.. బెలుం గుహలు

★ బెలుంగుహలు



● అనంతపురం జిల్లా సరిహద్దులో ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతం. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం బెలూం గ్రామంలో గుహలు ఉన్నాయి. భూమి ఉపరితలానికి సుమారు 20 మీటర్ల లోతులో 10 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్నాయి. లోపల మంచినీటి కొలనులు, సహజంగా ఏర్పడిన శిలలు, లింగాలు విశేషంగా ఆకర్షిస్తాయి. పెద్దలకు ప్రవేశ రుసుం రూ.70, పిల్లలకు రూ.50.

■ 83 కి.మీ. ✦ బస్సుల్లో చేరుకోవచ్చు.

- న్యూస్‌టుడే, తాడిపత్రి

కర్ణాటకాంధ్ర జీవనాడి

★ తుంగభద్ర జలాశయం

● తుంగభద్ర పుట్టుక, ప్రస్తానం మహాద్భుతం. మూడు రాష్ట్రాల అన్నదాతలకు ఆసరాగా నిలుస్తోంది. అద్భుతమైన శైలితో ఆనకట్ట నిర్మించారు. జలసవ్వడులు.. ఆకర్షణీయమైన ఉద్యానవనాలు ఆహ్లాదాన్ని పంచుతాయి. ఉదయం నుంచి రాత్రిదాకా పిల్లపాపలతో సేదదీరవచ్చు. జింకలు, గులాబీల పార్కు ఆకట్టుకుంటుంది. చేపల అక్వేరియాన్ని తిలకించవచ్చు.

■ 149 కి.మీ.

✦ బస్సు లేదా రైలులో హొసపేటె చేరుకోవాలి. అక్కడి నుంచి 4 కిలోమీటర్ల దూరంలో డ్యాం ఉంది. బస్సులు లేదా షేర్ ఆటోలు ఉంటాయి.

- న్యూస్‌టుడే, హొసపేటె



తుంగభద్ర జలాశయం



పర్ణజ ఆక్వేరియం

చారిత్రక వైభవ దీప్తి.. విజయనగర కీర్తి

★ హంపీ ● విజయనగర రాజధాని. దక్షిణ కాశీగా ప్రసిద్ధి. పర్యాటకులు సజీవ స్మారక ప్రాంతం(లివింగ్ మాన్యుమెంట్) అని పిలుస్తారు. 42 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన హంపీలో 200 స్మారకాలు ఉన్నాయి. అడుగడుగునా గుడులు, గోపురాలు ఉండటం విశేషం. ప్రధాన స్మారకాలను ఒకరోజులో చుట్టేయవచ్చు. ఇక్కడ త్రికాల పూజలందుకునే విరుపాక్షుడు కొలువుదీరారు. హంపీకి దగ్గర్లో దరోజీ భల్లూకాల సంరక్షణ కేంద్రం, పులి, సింహాల సఫారీలు ఉన్నాయి.

■ 164 కి.మీ.

✦ హంపీ ఎక్స్‌ప్రెస్ రైల్లో హొసపేటె చేరుకోవచ్చు. బస్సులో వచ్చేవారు బళ్లారి వచ్చి, అక్కడి నుంచి హొసపేటె రావాలి. ఇక్కడి ఆర్టీసీ బస్టాండు నుంచి అరగంటకు ఓ బస్సు బయల్దేరుతుంది. హంపీని చుట్టేయటానికి షేర్ ఆటోలు దొరుకుతాయి.

- న్యూస్‌టుడే, హొసపేటె



హంపీ క్షేత్రం



ఏకశిలా రథాన్ని తిలకిస్తున్న పర్యాటకులు

సహకార సంఘాల కంప్యూటరీకరణ వేగవంతం చేయాలి

తపోవనం (అనంత గ్రామీణం): ఉమ్మడి జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో వచ్చే నెల 2లోగా కంప్యూటరీకరణ పూర్తి చేయాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పీవోస్, సంయుక్త కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. గురువారం సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘాల లావాదేవీలన్నీ వచ్చే నెలలో అంతర్జాలంలో జరిపించే విధంగా కంప్యూటరీకరణ చేయాలన్నారు. ఇప్పటికే నష్టాల్లో ఉన్న సొసైటీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి లాభాల్లోకి తీసుకురావాలని ఆయన సూచించారు. సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పరపతేతర వ్యాపారాలతో సొసైటీలను ఆర్థికంగా బలోపేతం చేస్తే ఉద్యోగులకు జీతాల సమస్య ఉండదన్నారు. దీనిపై సహకార సంఘాల ఉద్యోగులు జేసీ కలిసి అనేక సమస్యలపై విన్నవించారు. గత 18 నెలల నుంచి అనేక సొసైటీల ఉద్యోగులకు జీతాలు అందలేదని మొరపెట్టుకున్నారు.

పట్టు సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు
- రైతుల సమస్యలకు జేడీ పద్మావతి పరిష్కారాలు

ఈనాడు మీ తోడు

పుట్టపర్తి, హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టు రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు పథకాలను అందిస్తోంది. రాయితీలను సద్వినియోగం చేసుకుని, యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు గడించవచ్చునని పట్టు పరిశ్రమలశాఖ జేడీ పద్మావతి పేర్కొన్నారు. గురువారం బైవోల్టిన్ పట్టు రైతులకు అందాల్సిన ప్రోత్సాహకాలు, బకాయిలు, రాయితీలు, పథకాలు, సాగులో ఇబ్బందులు, పాటించాల్సిన మెలకువలపై పట్టు పరిశ్రమలశాఖ జిల్లా అధికారి దుగ్గిరాల పద్మావతితో **పట్టు రైతులూ 'ఈనాడు' మీతోడు** కార్యక్రమం నిర్వహించారు. రైతుల సమస్యలు ఓపిగ్గా విన్న జేడీ వారి సందేహాలను నివృత్తి చేశారు.



చరవాణి ద్వారా సమస్యలు తెలుసుకుంటున్న జేడీ పద్మావతి

సమస్య: కొత్తగా మల్బరీ తోట 4 ఎకరాల్లో సాగు చేసేందుకు భూమి దుక్కి చేసి సిద్ధం చేశా, ఎర్ర నేల, నీటి సదుపాయం ఉంది. ఎలాంటి రాయితీలు అందిస్తారు. **- రైతు ఆదినారాయణ, రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లి.**

జేడీ: ఎర్ర నేలల్లో మల్బరీ సాగు చేయవచ్చు. పట్టు పరిశ్రమలశాఖ ద్వారా ఒక ఎకరాలో మల్బరీసాగుకు రూ.22,500, పట్టు పురుగుల పంపకం గది నిర్మాణానికి రూ.3,37,500, రీలింగ్ పరికరాలకు రూ.56,250 చొప్పున ప్రభుత్వం రాయితీ అందిస్తుంది.

సమస్య: ఊజీ ఈగల బెడద అధికంగా ఉంది. నివారణకు ఉపయోగించే మందుల వల్ల పట్టు పురుగులకు నష్టం జరుగుతోంది. ఎలాంటి చర్యలు తీసుకోవాలి. **- ఆనంద్, రామగిరి మండలం, చిన్న కొండాపురం, కదిరప్ప, కదిరి గ్రామీణ మండలం ముత్యాలచెరువు**

జేడీ: ఊజీ నివారణ కోసం నాశన్ ఫ్రేములు, ట్రాపులు మార్కెట్‌లో లభిస్తాయి. వీటిని వినియోగించడం వల్ల ఎటువంటి నష్టం జరగదు.

సమస్య: బైవోల్టిన్ పట్టు పురుగులు రోగాల వల్ల పంట నష్టం జరుగుతోంది. మల్బరీ ఎలాంటి చర్యలు తీసుకోవాలి. - రైతు రమేష్, పరిగి నాగరాజు, రైతు కృష్ణారెడ్డి, పెనుకొండ

జేడీ: ఆకులపై ఎర్రమచ్చ రాకుండా షెడ్‌లో తగు ఉష్ణోగ్రతలు, తేమ శాతం సరిచూసుకోవడమే కాకుండా 60 శాతం, ఆకు నాణ్యతపైన పంట దిడుబడి ఉంటుంది.

సమస్య: మల్బరీ సాగుకు మొక్కలు ఎక్కడ లభిస్తాయి. చిరునామా తెలియజేయండి. **- రైతు తిమ్మారెడ్డి, చెరువువాండ్లపల్లి, నల్లమాడ మండలం**

జేడీ: రైతులకు అవసరమైన మల్బరీ మొక్కలు కదిరి సహాయసంచాలకుల కార్యాలయంలో నందు అందుబాటులో ఉన్నాయి.

సమస్య: పట్టు పురుగుల గది నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు ఎంత రాయితీ అందిస్తారు. ఎలా దరఖాస్తు చేసుకోవాలి. **- వెంకట్రాముడు, మల్లెపల్లి**

జేడీ: పట్టు పురుగుల పెంపకానికి ఎస్టీ రైతులకు గది నిర్మాణానికి పరిశ్రమల శాఖ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రూ.4.05 లక్షలు రాయితీ అందించడం జరుగుతుంది. కళ్యాణదుర్గం పట్టు పరిశ్రమల శాఖ కార్యాలయంలో సంప్రదిస్తే, మంజూరు చేస్తారు.

సమస్య: పట్టు పురుగుల పెంపకపు గది నిర్మాణానికి సంబంధించి స్టేట్ షేర్, పడలేదు. రాయితీ నిధులు మంజూరు చేయండి. **- రైతు క్రిష్టప్ప, రొళ్ల, రైతు శ్రీనివాసులు, చిలమత్తూరు.**

జేడీ: కమిషనర్ పట్టు పరిశ్రమల శాఖ గుంటూరు స్టేట్ సెర్ నిధుల మంజూరు కోసం సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు సమర్పించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే, నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

సమస్య: బైవోల్టిన్ పట్టు గూళ్లకు అందించే ప్రోత్సాహకాలు, పట్టు పురుగుల రోగ నిరోధన మందుల రాయితీలు మంజూరు కావడం లేదు. **- రైతు శ్రీనివాసులు, మడకశిర**

జేడీ: పట్టు పురుగుల రోగ నిరోధక మందులు, రాయితీ నిధులు మంజూరు చేయడం జరిగింది. వారంలో రైతుల ఖాతాలకు జమ అవుతాయి.

సమస్య: బైవోల్టిన్ పట్టు గూళ్లకు అందించే రాయితీ ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. ఖతాల్లో జమ చేయించండి.
- ఓరుగంటి శివ, చేబ్రోలు, శ్రీసత్యసాయి జిల్లా

జేడీ: ఈ ఆర్థిక సంవత్సరానికి మొదటి, రెండో క్వార్టర్‌లో పట్టుగూళ్ల ఉత్పత్తికి రైతు ప్రోత్సాహక నిధులు ప్రభుత్వం నిధుల విడుదల చేసింది. మొదటి క్వార్టర్‌కు సంబంధించిన బిల్లులు రెండ్రోజుల్లో జమ అవుతాయి.

సమస్య: పట్టు పురుగుల పెంపుడు, వరండా నిర్మాణానికి ఎలాంటి రాయితీ మంజూరు కాలేదు. మంజూరు చేయించండి. - సోమశేఖర్‌రెడ్డి, శెట్టిచిన్నంపల్లి, గోరంట్ల మండలం, రైతు కృష్ణవేణి, దిడిగళ్లు, తాడిమర్రి మండలం

జేడీ: ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం మొదట విడత క్రింద నిధులు విడుదల చేసింది. త్వరలో రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

తక్షణ స్పందన

ఈ సందర్భంగా మైలేపల్లికి చెందిన రైతు చంద్రారెడ్డి చరవాణిలో జేడీకి తన సమస్యను వివరించారు. మల్బరీకి వస్తున్న తెగులు గురించి తెలిపారు. దీంతో ఆమె వెంటనే స్పందించారు. గ్రామానికి వెళ్లి మల్బరీ సాగును పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలపై అవగాహన కల్పించారు. తర్వాత పురుగుల పెంపకం బిల్లులు అందలేదని తెలియజేసిన రైతులకు ఖతాలు పరిశీలించారు. త్వరలో జమ అవుతాయని వివరించారు.



మైలేపల్లిలో మల్బరీ సాగును పరిశీలించి రైతుకు సూచనలు ఇస్తున్న జేడీ

వరద బాధితులకు అంగన్‌వాడీల సాయం

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు జిల్లా అంగన్‌వాడీల సంక్షేమ సంఘం తరపున సాయం అందించడానికి ముందుకు వచ్చారు. ఇటీవల వరదలతో విజయవాడలో అనేక ప్రాంతాల ప్రజలు నిరాశ్రయులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం విరాళాలు ఇవ్వాలని పిలుపునివ్వడంతో జిల్లాలో పనిచేస్తున్న అంగన్‌వాడీలు, ఆయాలు ఒక్కో కేంద్రం నుంచి రూ.100 చొప్పున ఇవ్వడానికి అంగీకారం తెలుపుతూ జిల్లా కార్యాలయంలో పీడీ నాగమల్లేశ్వరికి లిఖిత పూర్వకంగా లేఖను అందజేశారు. జిల్లావ్యాప్తంగా 2,500 కేంద్రాల నుంచి రూ.2.50 లక్షలు వరద సాయంగా అందిస్తున్నట్లు యూనియన్ అధ్యక్షురాలు శ్రీదేవి, కమిటీ సభ్యులు తెలియజేశారు.



విరాళం ఇవ్వడానికి అంగీకారం పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

అటవీ సంరక్షణకు కృషి

బుక్కపట్నం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా నూతన డీఎఫ్‌ఓగా టి.చక్రపాణి బాధ్యతలు చేపట్టారు. గురువారం సాయంత్రం జిల్లా అటవీశాఖ కార్యాలయంలో నూతన డీఎఫ్ఓగా చక్రపాణి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలు వివరించారు. జిల్లాలో అటవీ సంరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తాం. అటవీ ప్రాంతంలోని జంతువుల సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టాలో పరిశీలించి తగిన చర్యలు చేపడతాం. అతిపెద్ద అటవీ ప్రాంతమైన ఈ ప్రాంతంలో నగర వనాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు చర్యలు చేపడతాం. ఇప్పటికే ఉన్న నగర వనాలను మరింత అభివృద్ధి చేసి పర్యాటకులకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని డీఎఫ్ఓ వివరించారు.



డీఎఫ్ఓ చక్రపాణి

టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి కృషి

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలోని టెక్స్‌టైల్ పార్కును రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళీ శాఖ మంత్రి ఎస్.సవిత గురువారం రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుతో కలిసి సందర్శించారు. కాలవ అధ్యక్షతన కార్మికులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గార్మెంట్స్ రంగానికి పూర్వ వైభవం తీసుకురావాలని ఈ సందర్భంగా కాలవ కోరారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేను గార్మెంట్స్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. గార్మెంట్స్‌లో దుస్తుల తయారీని వారు పరిశీలించి కార్మికులు, యజమానులతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల జగన్ ప్రభుత్వం చేనేత పరిశ్రమను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం త్వరలో నూతన టెక్స్‌టైల్ పాలసీ తీసుకురానుందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుస్మిత, అనంతపురం హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ ఏడీ శ్రీనివాసరెడ్డి, రాయదుర్గం గార్మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టంకశాల హనుమంతు, కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్లు ప్రశాంతి, తెదేపా మండల కన్వీనర్లు ఎంఆర్ఎఫ్ హనుమంతు, హనుమంతరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



దుస్తుల తయారీని పరిశీలిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే కాలవ

హంద్రీనీవా ఎస్ఈ బదిలీ

హెచ్చెల్సీ ఉప ఎస్ఈ సైతం..

అనంతపురం (శ్రీనివాస్‌నగర్): జిల్లా జలవనరుల శాఖలో కీలక పోస్టుల్లో పని చేస్తున్న ఈఈలు బదిలీ అయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి. హంద్రీనీవా ఇన్‌ఛార్జి ఎస్ఈ దేసేనాయక్‌ను నెల్లూరు డ్రైనేజీ డివిజన్‌కు బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. హెచ్చెల్సీ ఉప ఎస్ఈ సునీల్‌నాయక్‌ను తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు ఉపఎస్ఈగా బదిలీ చేశారు. ఈయన స్థానంలోకి పోలవరం ప్రాజెక్టులో పని చేస్తున్న సూర్యభాస్కర్ శర్మను నియమించారు. చిన్ననీటి పారుదల (ఎంఐ) అనంత ఐబీ డివిజన్ ఈఈ సి.ప్రతాప్‌ను నంద్యాల కేసీ డివిజన్‌కు బదిలీ పొందారు. ఇక హెచ్చెల్సీలో కీలక లోక లైజేషన్ డివిజన్ ఈఈగా కర్నూలు ఎంఐలో పని చేస్తున్న ఆర్ఎస్ఆర్ పుల్లారెడ్డిని నియమించారు. ఈ స్థానంలో ఉన్న డీఈ రమణారెడ్డి ఇన్‌ఛార్జిగా పని చేస్తున్న సంగతి తెలిసిందే.

'రెవెన్యూ' బదిలీల్లో మార్పులు


జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ శాఖలో కొన్ని కేడర్ల బదిలీలు మార్పులు జరిగాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను గురువారం వెల్లడయ్యాయి. ఉప తహసీల్దార్లల్లో 19 మంది, ఎంఆర్ఐ/సీనియర్ సహాయకుల కేడర్‌లో 18 మంది చొప్పున బదిలీల స్థానాలు మార్పు జరిగాయి. సరిగ్గా ఐదు రోజుల క్రితం రెవెన్యూ శాఖలో 120 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తపరచడంతో కొన్ని కేడర్ల బదిలీల్లో మార్పులు జరిగినట్లు తెలుస్తోంది. సత్వరమే కొత్త స్థానాల్లో చేరాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

పరిశ్రమల శాఖ ఇన్‌ఛార్జి అధికారిగా రాజశేఖర్‌రెడ్డి

జిల్లా పరిశ్రమల శాఖ (డీఐసీ) ఇన్‌ఛార్జి అధికారిగా ఏడీ రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఇక్కడి డీడీ నాగరాజారావు గురువారం రిలీవ్ అయ్యారు. అనకాపల్లి నుంచి రెగ్యులర్ డీడీ రావాల్సి ఉంది. అప్పటి దాకా రాజశేఖర్‌రెడ్డినే బాధ్యతలు నిర్వర్తిస్తారు. కొత్త అధికారి అక్టోబరు 2 లేదా 3న బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

రాష్ట్ర సీనియర్ మహిళా ఫుట్‌బాల్ విజేత అనంతపురం

రన్నరప్‌గా శ్రీసత్యసాయి జిల్లా



అతిథుల నుంచి విన్నర్ ట్రోఫీ అందుకున్న అనంతపురం జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : విజయవాడ శివారు కానూరులోని అనుమోలు ప్రభాకర్ గార్డెన్స్ మైదానంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ మహిళల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. శ్రీ సత్యసాయి జిల్లా జట్టు రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. మూడో రోజైన గురువారం జరిగిన రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీ సత్యసాయి, కర్నూలు జట్లు తలపడ్డాయి. షూటౌట్స్‌లో శ్రీ సత్యసాయి జట్టు 5-3 గోల్స్ తేడాతో కర్నూలుపై విజయం సాధించి ఫైనల్‌లో ప్రవేశించింది. తృతీయ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు 2-0 గోల్స్ తేడాతో కర్నూలుపై గెలుపొందింది. సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జట్టు 4-0 గోల్స్ తేడాతో శ్రీసత్యసాయి జిల్లా జట్టుపై విజయాన్ని నమోదు చేసుకుంది. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ముని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా, కె.బాలకృష్ణ గౌరవ అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, వ్యక్తిగత పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఎం.డానియేల్ ప్రదీప్, అనుమోలు ప్రభాకర్ జట్టు ఎంపిక కమిటీ సభ్యులు పి.ఆలీబాబా, ఎస్.అప్పారావు, కోనసీమ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వై.నీలాద్రి, రాష్ట్ర సంఘం కోశాధికారి వి.విజయ్‌కుమార్, మ్యాచ్ కమిషనర్ ఎండీ సిరాజుద్దీన్, ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



రన్నరప్ ట్రోఫీతో శ్రీసత్యసాయి జట్టు

అప్పు తిరిగిమ్మని అడిగినందుకు దాడి

కనగానపల్లి: అప్పు తిరిగి ఇమ్మని అడిగినందుకు ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపడిన ఘటన కనగానపల్లి మండలం తూముచెర్లలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అమీర్‌కు నాలుగు నెలల క్రితం వన్నూర్ రూ.20 వేలు అప్పుగా ఇచ్చాడు. తిరిగి ఇవ్వాలని అడిగినందుకు అమీర్, అతని బంధువులు బాబావలి, సత్తార్ దాడిచేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


తండ్రి మరణంతో కుంగి..

కుమార్తె ఆత్మహత్య

కనగానపల్లి, న్యూస్‌టుడే: తండ్రి మరణంతో కుంగిపోయిన కుమార్తె మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. కనగానపల్లి గ్రామానికి చెందిన ఇందిర (40) కూడేరుకి చెందిన మలరాయుడుకి 18 సంవత్సరాల క్రితం ఇచ్చి వివాహం చేశారు. 8 సంవత్సరాల క్రితం భర్తను వదిలి తన తల్లిదండ్రుల వద్దనే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేది. 3 నెలల క్రితం ఆమె తండ్రి కిష్టప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అప్పటినుంచి కుంగిపోయింది. కుటుంబ పెద్దను కోల్పోగా దిక్కుతోచని స్థితిలో ఉన్నవారికి ఆదరించేవారు లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంది. గురువారం తెల్లవారుజామున ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేతను పోలీసులకు పట్టించిన స్థానికులు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణం రైల్వేస్టేషన్ రోడ్డులో నివాసం ఉంటోన్న షామీర్, షబీనా దంపతులు ఇంట్లోనే గంజాయి విక్రయిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. ఒకటి, రెండుసార్లు హెచ్చరించినా వారిలో మార్పురాలేదు. గురువారం పిల్లల సాయంతో గంజాయిని అమ్ముతుండగా స్థానికులు అడ్డుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రైల్వేస్టేషన్ రోడ్డుకు చేరుకుని షామీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నివాసాల మధ్య గంజాయిని విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్.ఎస్.రోడ్డువాసులు పోలీసులను కోరారు.



పోలీసుల అదుపులో షామీర్

బాలికపై పెద్దనాన్న కుమారుడి అత్యాచారం

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే : పెద్దపప్పూరు మండలంలోని ఓ గ్రామంలో 13 ఏళ్ల బాలికపై పెద్దనాన్న కుమారుడు అత్యాచారం చేశాడు. ఈఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలిక తల్లిదండ్రులు ఆమె చిన్నతనంలో చనిపోయారు. అప్పటి నుంచి బాలిక వారి పెద్దనాన్న సంరక్షణలో ఉంటోంది. బాలిక వేరే మండలంలో ఎనిమిదో తరగతి చదువుతోందని, ఆమెను తీసుకురావడం, తీసుకెళ్లడం చేస్తుండేవాడు. ఈక్రమంలో కొన్ని రోజులుగా బాలిక దిగాలుగా ఉండటం గమనించిన ఉపాధ్యాయులు ఆరా తీశారు. బాలిక పెద్దనాన్న కుమారుడు తనపై చేసిన అఘాయిత్యాన్ని చెప్పింది. ఉపాధ్యాయులు పెద్దపప్పూరు పోలీసులకు సమాచారం అందించారు. బాలిక ఫిర్యాదుతో యువకుడిపై పొక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు.

ఆటోను ఢీకొన్న జడ్పీ ఉపాధ్యక్షుడి వాహనం

ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం మండలం పోతుకుంట వద్ద జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి స్కార్పియో వాహనం ఆటోను ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న కుణుతూరు గ్రామానికి చెందిన జనార్దన్, యశ్వంత్‌రెడ్డి, అఖిలానందరెడ్డి గాయపడ్డారు. జనార్దన్‌కు తీవ్రగాయాలు తగిలాయి. క్షతగాత్రులను స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కామిరెడ్డిపల్లి నుంచి ధర్మవరానికి సుధాకర్‌రెడ్డి స్కార్పియో వాహనంలో వస్తుండగా ధర్మవరం నుంచి కుణుతూరు వెళుతున్న ఆటోను ఢీకొంది. స్కార్పియో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. కరెంటు స్తంభం ఒకవైపు ఒరిగిపోయింది. ప్రమాద ఘటన అనంతరం అక్కడి నుంచి సుధాకర్‌రెడ్డి మరో వాహనంలో ధర్మవరం వెళ్లారు. గాయపడిన ముగ్గురిని ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన జనార్దన్ ఫిర్యాదు మేరకు ధర్మవరం గ్రామీణ పోలీసులు సుధాకర్‌రెడ్డి, డ్రైవర్ శ్రీకాంత్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

చీనీ చెట్ల నరికివేత

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే : మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో రైతు వెంకటలక్ష్మికి చెందిన నాలుగు నెలల వయస్సు ఉన్న 50 చీనీ చెట్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. గురువారం ఉదయం పొలంలో పనులు చేసేందుకు వెంకటలక్ష్మి వెళ్లగా చెట్లను నరికివేసి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాముసుబ్బయ్య, ఎస్సై గౌస్‌బాషా పొలానికి వెళ్లి పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురం ఆసుపత్రిలో విచారణ

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ఈ సంవత్సరం ఆగస్టు 22న ప్రభుత్వాసుపత్రిలో గర్భంలోనే ఇద్దరు శిశువులు మృతిచెందిన ఘటనలపై రెండు రోజులుగా ప్రభుత్వ ఆసుపత్రిలో విచారణ చేస్తున్నారు. విజయవాడకు చెందిన విచారణ అధికారిణి స్వప్నసింధూరి, ఏవో నాగేంద్రకుమార్‌లు బాధితులను విచారించి ఆసుపత్రిలో ఎంసీహెచ్ వార్డులో గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 23న పత్రికల్లో వచ్చిన కథనాలపై ఉన్నతాధికారులు తమను విచారణ అధికారిగా నియమించారన్నారు. ఈ మేరకు బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించామన్నారు. నివేదికను ఈనెల 28వ తేదీలోపు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఎంసీహెచ్ వార్డులో ప్రసవాలు, గర్భిణులకు అందుతున్న వైద్యసేవలు, వైద్యుల పనితీరుపై విచారణ చేశామన్నారు.

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

సినిమా చిత్రీకరణకు స్థలాల పరిశీలన




దర్గా ఆవరణలో మాట్లాడుతున్న దర్శకుడు, తదితరులు

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: రాయలసీమలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర సినియా చిత్రీకరణ కోసం గురువారం దర్శకుడు వెంకట నరసింహరాజు లొకేషన్లు పరిశీలించారు. అనంతరం స్థానిక బాబయ్యస్వామి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 75 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకొన్నామని, ఈ చిత్రంలో నటీనటులుగా సుమన్, ఇంద్రజ ఉంటారని పేర్కొన్నారు. ఆయన వెంట జనసేన మహిళా నాయకురాలు శ్రీదేవి, చిత్ర సిబ్బంది, తదితరులున్నారు.

పేరు ఘనం.. అభివృద్ధి శూన్యం

లేపాక్షిలో పర్యాటకులకు సౌకర్యాలేవీ



పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన లేపాక్షి



ఏకశిలా నంది విగ్రహం



ఏడు శిరస్సుల నాగేంద్రుడు

లేపాక్షి, హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: లేపాక్షి.. ఆ పేరు వినగానే మనకు గుర్తొచ్చేది ప్రపంచంలోనే అతి పెద్ద ఏకశిలా నంది విగ్రహం, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, వేలాడేస్తంభం, లతా మండపం. ఇంతటి చారిత్రక నేపథ్యమున్న లేపాక్షికి ప్రతినిత్యం వంద సంఖ్యలో, శని, ఆదివారాల్లో వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచేగాక విదేశాల నుంచి పర్యాటకులు లేపాక్షి సందర్శనకు వస్తుంటారు. ఉమ్మడి జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. అయితే ఇక్కడి పరిస్థితులు చూస్తే 'పేరు ఘనం.. అభివృద్ధి శూన్యం' అన్న చందంగా ఉంది. ఇక్కడ పర్యాటకుల సౌకర్యార్థం ఆశించిన మేరకు వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఇక్కడ చేయాల్సిన పనులపై కథనం.

ఉత్సవాలతో వెలుగులోకి...

ఎంతో ఘన చరిత్ర కల్గిన లేపాక్షి ఆలయ ఘనకీర్తి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలతో విశ్వవ్యాప్తమైంది. మొదటగా 2012లో కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్వహించగా, తర్వాత అధికారంలోకి వచ్చిన తెదేపా ఎమ్మెల్యే బాలకృష్ణ నేతృత్వంలో రెండమార్లు ఉత్సవాలను ప్రపంచ స్థాయికి తగినట్లుగా చేసి లేపాక్షికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. ఆయన హయాంలోనే లేపాక్షిలో జఠాయువు థీం పార్కు పేరుతో పక్షిని ఏర్పాటు చేసి ఆ ప్రాంతమంతా సుందరంగా తీర్చిదిద్దారు. జఠాయువు మోక్ష ఘాట్ పేరుతో పక్షి పడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు బస చేసేలా పర్యాటకశాఖ అతిథి గృహాన్ని నిర్మించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చేయాల్సిన కార్యక్రమాలు

- పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా లేపాక్షిలో సామాన్యులకు అందుబాటులో ఉండేలా వసతి గృహాలు ఏర్పాటు చేయాలి.
- నాణ్యమైన, రుచికరమైన అల్పాహారం, భోజన సౌకర్యం కల్పించాలి.
- హిందూపురం రైల్వే స్టేషన్, కొడికొండ చెక్‌పోస్టు వద్ద లేపాక్షి ప్రాశస్త్యం తెలుపుతూ హోర్డింగులు ఏర్పాటుచేయాలి.
- కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు చేపట్టాలి.
- థీంపార్కు వద్ద శిథిలావస్థకు చేరిన కోనేరును పునరుద్ధరించి.. ఎంపోరియం ప్రారంభించాలి.
- లేపాక్షితో పాటు సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, పెనుకొండలను కలుపుతూ సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలి.
- ప్రతియేటా ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులు చేస్తే లేపాక్షిని పర్యాటకులకు స్వర్గధామంగా తీర్చిదిద్దవచ్చు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: కురుబరపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి. **- నిరంజన్**
సమాధానం: ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తా. **-రామారావు, ఎంపీడీఓ**
సమస్య: మోరుబాగల్‌లో ఇందిరమ్మ కాలనీలో నీటి సమస్య. **-యువరాజు**
సమాధానం: పైపులైన్ వేసి పరిష్కరిస్తాం. **- తిప్పేస్వామి, సర్పంచి**
–న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: పరిగిలోని ఇందిరమ్మ బీసీ కాలనీలో చిన్నపాటి వర్షానికే రహదారులు బురద మయంగా మారుతున్నాయి. **-రాధమ్మ, సరోజమ్మ, గాయిత్రీ**
సమాధానం: మన్ను వేసి బాగు చేస్తాం. **-అరుణ, కార్యదర్శి**
సమస్య: బిందూనగర్‌లో కల ఆర్‌పీటీజీ లే అవుట్లో నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. **-మల్లికార్జున**
సమాధానం: కొత్తవి ఏర్పాటు చేస్తాం. **- నారాయణ, కార్యదర్శి, కొడిగెనహళ్లి.**
–న్యూస్‌టుడే, పరిగి

సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

హిందూపురం గ్రామీణం : "మేమున్నాం.. మీకుతోడుగా" వచ్చిన సమస్యలకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు.

- కిరికెరలో ఎంపీడీవో నరేంద్రకుమార్, సర్పంచి, పంచాయతీ అధికారులతో సంప్రదించి గ్రామంలో పర్యటించి చెత్తకుండీలను ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకున్నారు. బేవనహళ్లిలో తాగునీటి పైపులైన్‌కు ఏఈ దివ్య తాత్కాలిక మరమ్మతు చేయించారు. నీరు సరఫరా అయ్యేలా చూశారు.

ప్రతి హామీని నెరవేరుస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్ఎస్ రాజు

అమరాపురం, న్యూస్‌టుడే: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూటమి ప్రకటించిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే ఎమ్ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నాగోనపల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలో వక్క మార్కెట్ ఏర్పాటుకు స్థల పరిశీలన పూర్తయిందని వక్క మార్కెట్‌తో పాటు, చింతపండు మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో నియోజకవర్గంలో 60కి పైగా తాగునీటి బోర్లు వేయించి ప్రజల దాహార్తి తీర్చామని, రైతులకు అవసరమైన నియంత్రికలను అందించినట్లు తెలిపారు. హంద్రీనీవా బైపాస్ కెనాల్‌తో పాటు రాళ్లపల్లి, రత్నగిరి వద్ద రిజర్వాయర్లు నిర్మిస్తామన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రూ.6.3 కోట్లు రుణాలు అందించినట్లు తెలిపారు. తెదేపా కన్వీనర్ గణేష్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నరసింహమూర్తి, వక్కలిగ సాధికార రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగప్ప, ఎంపీడీవో భాస్కర్, ఉప తహసీల్దార్ నవీన్ కుమార్ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు జయకుమార్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, ఎంజేపీ పాఠశాలల విద్యార్థులకు పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 24, 25 తేదీల్లో నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు జరిగాయి. అండర్-14, అండర్-17 విభాగాలలో బాలురు, బాలికలకు నిర్వహించిన వాలీబాల్, చెస్, షటిల్, ఖోఖో, యోగా, అథ్లెటిక్స్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపికచేశారు. 27న శుక్రవారం అనంతపురంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

సౌర విద్యుత్తుతో లబ్ధి



ఒప్పంద పత్రాన్ని అందిస్తున్న ఈఈ భూపతి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ రాయితీ పథకం ద్వారా ఇంటిపై సోలార్ విద్యుత్తు ప్లాంటు ఏర్పాటు చేసుకొని దాన్ని గ్రిడ్‌కు అనుసంధానం చేయటంతో ఆర్థికంగా లబ్ధి పొందవచ్చని విద్యుత్తు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భూపతి అన్నారు. పట్టణంలోని పాండురంగ నగర్‌కి చెందిన బి.ఓబులేశుమిత్ర, ప్రతిభ గురువారం ఈ పథకం కింద తమ నివాసంపై సాయి మిత్ర ఇండియా లిమిటెడ్ సంస్థ ద్వారా 4 కిలోవాట్ల సామర్థ్యం గల సన్ మిత్ర, సన్‌టెక్ సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకొన్నారు. గురువారం ఈ విద్యుత్తును గ్రిడ్‌కు ఈఈ భూపతి అనుసంధానం చేసి 25 సంవత్సర కాలానికి విదుత్తు కొనుగోలు ఒప్పంద పత్రాన్ని లబ్ధిదారులకు అందించారు. ఏడీఈ నాగన్న, నోడల్ ఆఫీసర్ అబ్దుల్ రహీమ్, ఏఈలు విష్ణు, లక్ష్మీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వారపు సంతలో తనిఖీ



తూకాలను పరిశీలిస్తున్న అధికారులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక వారపు సంతలో గురువారం సాయంత్రం తూనికలు-కొలతల అధికారి శివశంకర్ తనిఖీలు చేపట్టారు. కూరగాయలు, నిత్యావసరాల దుకాణాల్లో తూకాలు, రాళ్లను పరిశీలించారు. రాళ్లకు వచ్చే నెలలో సీళ్లు వేయించాలని, ప్రజలకు సక్రమంగా తూకాలు వేసి సరకులు, కూరగాయలు ఇవ్వకుండా మోసం చేస్తున్నట్లు తమ తనిఖీల్లో పట్టుబడితే చర్యలు తప్పవని అధికారి అందరికీ తెలియజేశారు.

2న మెగా క్రికెట్ పోటీలు

సోమందేపల్లి: సోమందేపల్లిలో గాంధీ జయంతి సందర్భంగా మెగా క్రికెట్ పోటీలను (టోర్నమెంటు)ను నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు జబీవుల్లా తెలిపారు. ఈమేరకు ఆయన పలువురు క్రీడాకారులతో కలిసి ఎస్సై రమేశ్‌బాబు టోర్నీ నిర్వహణ కోసం అనుమతించాలని వినతిపత్రం అందజేశారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

లేపాక్షి : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కళాశాల విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ మేరకు వినతిని ఆర్ఐ ప్రమీలకు అందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, నియోజకవర్గ అధ్యక్షుడు దేవరాజ్, నాయకులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల నూతన కమిటీ ఏకగ్రీవం

పెనుకొండ పట్టణం : స్థానిక నగరపంచాయతీలోని మెప్మా సమాఖ్యలో పనిచేస్తున్న ఆర్పీల నూతన కమిటీని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేశ్‌ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా లక్ష్మీదేవి, కార్యదర్శిగా సూనీత, గౌరవ అధ్యక్షుడిగా నారాయణలను ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు.

చిరుతల నుంచి కాపాడండి

గుడిబండ : మండల కేంద్రమైన గుడిబండలో చిరుతల నుంచి కాపాడాలని సర్పంచి కరుణాకర్‌గౌడు, గ్రామస్థులు శ్రీరామ్, రాజన్న, ఈరన్న, మహబూబ్‌పీరాలు కోరారు. గుడిబండ కొండ పరిసరాల్లో చిరుత సంచరిస్తుండడంతో కొండకు ఆనుకుని నివాసముంటున్న ప్రజలు భయకంపితులు అవుతున్నారన్నారు. అటవీ శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ

గోరంట్ల : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్వీపీఎం డిగ్రీ, ఎస్‌కేడీఆర్ జూనియర్ కళాశాల్లో గురువారం పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు భక్తవత్సలం, విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారుల పర్యవేక్షణలో విద్యార్థులు ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి పరిశుభ్రం చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

గోరంట్ల : మండలంలోని వానవోలు పురాతన కస్తూరి రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన సహకార సంఘం మాజీ అధ్యక్షుడు కరణం రాజేంద్రప్రసాద్, అతని సోదరుడు లక్ష్మీనారాయణరావు కుటుంబాలు రూ.1,11,111లు విరాళం ఆన్‌లైన్ బదిలీ ద్వారా గురువారం అందజేశారు. ఆవివరాలను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

లేపాక్షి, న్యూస్‌టుడే: దుకాణ యజమానులు తమ వ్యాపార సముదాయాల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈవో ఆర్డీ శివన్న సూచించారు. మండల కేంద్రంలోని పలు దుకాణ యజమానులకు గురువారం ఆయన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వ్యాపారులకు శుభ్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్ద ప్రత్యేకంగా బాక్సులు ఏర్పాటుచేసి అందులో చెత్తను వేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, మండల కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పులమతిలో పూజల కలకలం

లేపాక్షి : మండంలోని పులమతి-మానేపల్లి ప్రధాన రహదారిలో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు గురువారం ఉదయం కలకలం లేపాయి. గుప్తనిధుల కోసమా....లేదా ఇంకా ఏదైనా చేతబడి చేశారా...అనే అనుమానంతో స్థానికులు భయపడుతున్నారు. విషయం తెలుసుకున్న హిందూపురం డీఎస్పీ మహేష్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని దీనిపై విచారించారు. వారం క్రితం ఇక్కడ రోడ్డు ప్రమాదం జరిగిందని, గాయపడిన వ్యక్తి ప్రస్తుతం బెంగళూరు ఆస్పత్రిలో కోమాలో ఉన్నాడన్నారు. త్వరగా కోలుకోవాలంటూ కర్ణాటక నుంచి స్వామీజీని పిలిపించి ఇక్కడ పూజలు చేసినట్లు గుర్తించామన్నారు. ఇక్కడ ఎలాంటి క్షుద్ర పూజలు జరగలేదని వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు.

స్తంభం ఎక్కిన నిర్లక్ష్యం



పెనుకొండ పట్టణంలోని నాగులకట్ట కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి తీగలు కమ్మేశాయి. రాత్రి వేళ వీధి దీపం వెలిగినా తీగలు అల్లుకుపోవడంతో అంధకారం నెలకొంటుంది. అధికారులు తీగలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పెనుకొండ పట్టణం

భారీ వాహనాలతో రహదారి ఛిద్రం



హిందూపురం- పులమతి సడ్లపల్లి వరకు కొంత కాలం కింద వరకు తారు రహదారి రాకపోకలకు ఎంతో అనువుగా ఉండేది. పట్టణ సమీపం పులమతి రోడ్డులో ప్రైవేట్ వ్యక్తులు లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌కు మట్టి తరలించేందుకు వారు పెద్దవాహనాలు తిరగడంతో ప్రస్తుతం రహదారి గుంతలమయమైంది. వర్షం వస్తే గుంతల్లో నీళ్లు నిలిచి ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ మోహన్‌ను వివరణ కోరగా పరిశీలించి తగిన చర్యలు తీసుకొంటామన్నారు. **-న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్**

బడిలో నియంత్రిక.. భయంగా విద్యార్థులు



సోమందేపల్లి ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో విద్యుత్తు నియంత్రిక విద్యార్థులను భయాందోళనకు గురి చేస్తోంది. 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. నియంత్రికను తొలగించాలని హెచ్ఎం తబుసుం, ఉపాధ్యాయులు కోరినా పట్టించుకోలేదు. ఈ విషయంపై విద్యుత్తు ఏఈ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ వెంటనే అక్కడి పరిస్థితిని పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, సోమందేపల్లి

ఖాళీ స్థలం.. చెత్తమయం



పట్టణంలోని త్యాగరాజనగర్‌లో మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు, వాటి వసతి గృహాల వెనుక భాగంలో సివిల్ వివాదంతో ఎకరాల కొద్దీ స్థలం ఖాళీగా ఉంది. సేకరించిన చెత్తను ఆ ప్రదేశంలో వేస్తున్నారు. అంతటితో ఆగక పాత భవనాల తొలగింపు వ్యర్థాలను అక్కడే వేస్తున్నారు. దీనికి తోడు సంచార జాతుల వారు ఈ స్థలంలో గుడారాలు ఏర్పాటు చేసుకొని పందులను పెంచుకొంటున్నారు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు చెత్తను తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పందుల పెంపకం దారులకు నోటీసులు ఇస్తామని తెలిపారు. భవనాల మట్టి అక్కడ వదలకుండా చూస్తామని పేర్కొన్నారు. **-న్యూస్‌టుడే, హిందూపురం పట్టణం**

శుద్ధజల కేంద్రాలకు విద్యుత్తు బకాయిల గుదిబండ



మూతపడిన శుద్ధజల కేంద్రం

అమరాపురం, న్యూస్‌టుడే: అమరాపురం మండలంలో ఏడేళ్ల క్రితం అప్పటి తెలుగుదేశం ప్రభుతం ఫ్లోరైడ్ రహిత తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో పంచాయతీ కేంద్రాల్లో ఎన్టీఆర్ శుజల కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండేళ్ల పాటు ప్రజలకు ఈకేంద్రాల ద్వారా శుద్ధజలం అందింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటి నిర్వహణ బాధ్యతను పట్టించుకోక పోవడంతో నాలుగు కేంద్రాలు మూత పడ్డాయి. దీంతో విద్యుత్తు బకాయిలు పేరుకుపోయాయి. మద్దనకుంట శుద్ధజల కేంద్రం బకాయి రూ.19 వేలు, గౌడనకుంట కేంద్ర బకాయి రూ.22 వేలు, హేమావతి రూ.45 వేలు బకాయిలు చెల్లించాల్సి ఉంది. హలుకూరు శుద్ధజల కేంద్రం మూత పడ్డాక విద్యుత్తు సరఫరా నిలిపేశారు. ప్రస్తుతం కె.శివరం, నిడ్రఘట్ట పంచాయతీ కేంద్రాల్లో మాత్రమే శుద్ధజల కేంద్రాల ద్వారా ఫ్లోరైడ్ రహిత తాగునీరు అందుతోంది. ఈవిషయమై ఈవోఆర్డీ నాగమునిని వివరణ కోరగా మూత పడిన శుద్ధజల కేంద్రాలున్న పంచాయతీ కార్యదర్శి, సర్పంచులతో మాట్లాడి బకాయిలు చెల్లించడంతో పాటు మరమ్మతు చేయించి ప్రజలకు శుద్ధజలం అందిస్తామన్నారు.

పుర కమిషనర్ సేవలు మరువలేనివి



సన్మానిస్తున్న ఉద్యోగులు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్‌రెడ్డి అందించిన సేవలు, సహకారం మరిచిపోలేమని మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు బండి ఆనంద రాజు, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు సిరాల చంద్ర తదితరులు పేర్కొన్నారు. బదిలీ అయిన కమిషనర్‌కు గురువారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం కమిషనర్ బాధ్యతలను తాత్కాలికంగా టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ సునీల్‌కు అప్పగించారు. ఏడు నెలల పాటు ఇక్కడ కమిషనర్‌గా చేసిన శ్రీకాంత్ రెడ్డి కాకినాడ నగర పాలక సంస్థ కార్యదర్శిగా నియమితులైన విషయం తెలిసిందే.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మడకశిర: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని తెదేపా జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు భక్తర్ తెలిపారు. పట్టణంలోని చౌటిపల్లి గ్రామంలో గురువారం తెదేపా నాయకులు, అధికారులు, మహిళలతో కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నాయకులు బాబన్న, మాజీ కౌన్సిలర్ కృష్ణనాయక్, అంజమ్మ, తిమ్మరాజు, మహిళా పోలీసు అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



చౌటిపల్లిలో ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

ఆటో ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల నుంచి గంగాదేవిపల్లికి ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటో సింగిరెడ్డిపల్లి సమీపంలో గురువారం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. గంగాదేవిపల్లిలో పనిచేసే అంగన్‌వాడీ కార్యకర్త సరోజమ్మ, అదే గ్రామానికి చెందిన మోపిరెడ్డి, కాగానిపల్లికి చెందిన నంజుండప్పలు గాయపడ్డారు. క్షతగాత్రులకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు అందించి 108 వాహనంలో హిందూపురం పంపించారు.

మిద్దెపై నుంచి పడి ఒకరికి..

పెనుకొండ పట్టణం : కోనాపురం గ్రామానికి చెందిన సోమశేఖర్ రెడ్డి గురువారం రాత్రి 7గంటల సమయంలో ఇంట్లో టీవీ రాకపోవడంతో డిష్ తీగ పరిశీలించేందుకు మిద్దె ఎక్కి ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రున్ని కుటుంబ సభ్యులు, స్థానికులు 108వాహనంలో పెనుకొండ ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స అందించేందుకు డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యూటీ డాక్టర్ ఆలస్యంగా రావడంతో, నర్సు, వైద్యశాల సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. ఆలస్యంగా వచ్చిన వైద్యురాలు క్షతగాత్రున్ని పరిశీలించి తలకు బలమైన గాయం అవడంతో మెరుగైన వైద్యం కోసం 108వాహనంలో అనంతపురం తరలించారు.

గోశాలకు ఆవుదూడల అప్పగింత

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల పశువుల సంతను గురువారం సీఐ శేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కబేళాకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఎనిమిది ఆవుదూడల యజమానులు ఎవరని ఆరా తీయగా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో వాటిని కర్ణాటకలోని గోశాలకు తరలించారు.

మిరప పండింది.. ధర పడిపోయింది

కిలో రూ.150 నుంచి రూ.165 వరకు




రైతులు మార్కెట్‌కు తరలించుకొని వచ్చిన డెమిన్ రకం ఎండుమిరప

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ఈ ఖరీఫ్‌లో ఎండుమిరప పంట ఆశాజనకంగా ఉన్నా రైతుల చేతికి గిట్టుబాటు ధర అందటం లేదు. గతంలోకంటే ప్రస్తుతం పంట నాణ్యత బాగా ఉన్నప్పటికీ ధర పలకటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట ప్రారంభంలోనే ధరలు ఈ విధంగా ఉంటే ముందు మరింత పడిపోయే అవకాశం లేకపోలేదని రైతులు పేర్కొంటున్నారు. ఇటీవల మార్కెట్‌లో డెమిన్ రకం నాణ్యమైన ఎండుమిరప కిలో రూ.150 నుంచి రూ.165 వరకు ధర పలికింది. ఈ నాణ్యతకు కిలో రూ.200 పై బడి ధర ఉండాలని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కూలీల వ్యయం, మందుల ధరలు పెరగటంతో ఈ ధర ఏమాత్రం గిట్టుబాటుకాదంటున్నారు.

హిందూపురం వ్యవసాయ డివిజన్‌లో ఈ ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన మిరపపంట (హెక్టార్లలో)

మండలం	సాధారణసాగు	ప్రస్తుతసాగు	రైతులు
పరిగి	95	135	500
హిందూపురం	52	68	320
లేపాక్షి	31	45	280
చిలమత్తూరు	15	20	112
	193	268	1,212

ఈ సారి పంట ఆశాజనకం



గతంలో కంటే ఈ సంవత్సరం మిరపపంట ఆశాజనకంగా ఉంది. కూలీ వ్యయం, మందులు, పైరు ధరలు పెరిగాయి. దీనికి అనుగుణంగా మార్కెట్‌లో సరకు అమ్ముడుపోవటం లేదు. ప్రస్తుతం ఉన్న ధరలు ఇలాగే కొనసాగితే పంట సాగుకు పెట్టిన పెట్టుబడి చేతికి అందే అవకాశం లేదు. ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకొని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ఉంది.

- పల్లయ్య, శీగుపల్లి, పరిగి మండలం

ఎగుమతులు లేకనే..



గుంటూరు ఎండు మిరప, బ్యాడిగె రకాలు మాత్రమే ఎగుమతికి అవకాశం ఉందని స్థానికంగా రైతులు పండిస్తున్న వంగడం లోకల్ కావటంతో ఇది ఎగుమతి కావటం లేదని వ్యాపారులు ధరలు పెంచటం లేదు. దీని వలన పంట నాణ్యతగా ఉన్నా గిట్టుబాటు ధర లభించటం లేదు.

- రామకృష్ణ, సుద్దగుంటపల్లి, సోమందేపల్లి మండలం

మున్ముందు పెరిగే అవకాశం ఉంది

ప్రస్తుతం పంట ప్రారంభ దశలో ఉన్నందున పూర్తి స్థాయిలో నాణ్యమైన పండు మార్కెట్‌కు రావాల్సి ఉంది. గుంటూరులో మిరపపంట లేనందున తప్పక ముందుముందు నాణ్యమైన ఎండుమిరపకు మంచి గిట్టుబాటు ధర లభిస్తోంది. దీనిపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

-చంద్రమౌళి, కార్యదర్శి, వ్యవసాయమార్కెట్ యార్డు, హిందూపురం

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

వరద బాధితులకు విరాళాల వెల్లువ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: వరద బాధితులకు అండగా నిలిచి, మానవత్వంతో ఆదుకునేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారు. తమ విరాళాలను గురువారం ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి అందజేశారు. ఊరివాకిలి సురేష్ రూ.50 వేలు, కడియాల సుధాకర్‌నాయుడు రూ.25 వేలు, మాణిక్యం బాబా రూ.25 వేలు, కొండమరాజు రూ.20 వేలు, వీరాంజనేయులు రూ.20 వేలు, చలపతి రూ.15 వేలు, పీసీ గంగన్న రూ.10 వేలు, బి.రామాంజనేయులు రూ.10 వేలు, మహమ్మద్‌రఫీ రూ.10 వేలు, గూడూరు ఓబిలేశు రూ.10 వేలు, బెస్త బయన్న రూ.10 వేలు, బేకరి నాయుడు రూ.10 వేలు, చెన్నకేశవులు రూ.10 వేలు, కళావతి రూ.10 వేలు, రైతు పోతన్న రూ.10 వేలు, కొత్తపల్లి జయప్రకాష్ రూ.9 వేలు, వి.తిరుపాలు రూ.10 వేలు, సునీల్‌వైల్ల రూ.9 వేలు, రత్నప్పచౌదరి రూ.5 వేలు, శోభరాణి రూ.5 వేలు, హేమావతి రూ.5 వేలు అందజేశారు.

కబడ్డీ విజేత కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాల

ధర్మవరం పట్టణం: ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. గురువారం జరిగిన అండర్-14, 17 విభాగాల్లో బాలుర, బాలికల కబడ్డీ, వాలీబాల్, ఖోఖో విజేతలుగా ధర్మవరం కొత్తపేట, ఉన్నత పాఠశాల జట్లు నిలిచాయి. రన్నర్స్‌గా తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల పాఠశాలల జట్లు నిలిచాయి. విజయం సాధించిన జట్లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ నాగేంద్ర, రఘునాథ్‌రావు, నారాయణస్వామి, మల్లేష్ తెలిపారు.



కబడ్డీ విజేతలతో ఉపాధ్యాయినులు

ఎరువుల దుకాణాలు తనిఖీ

బత్తలపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి గురువారం తనిఖీ చేశారు. రైతులకు అవసరం మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు అందించాలన్నారు. మందులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ రసీదు ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు. అనంతరం మాల్యవంతం రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నల్లచెరువు (కదిరి), న్యూస్‌టుడే: మండలంలోని తవలంమర్రి గ్రామంలో అరుణోదయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామంలో గురువారం ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లతో పాటు నిత్యావసరాలను పంపిణీ చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో స్వచ్ఛత పాటించాలని, ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. డీఎల్‌పీఓ అంజినప్ప, ఎంపీడీఓ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో మందుల పరిశీలన

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువులోని ప్రాంతీయ పశువైద్యశాలలో డ్రగ్స్ నియంత్రణ శాఖ ఏడీ రమేష్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఏడీ మల్లేష్‌గౌడ్ సెలవులో ఉండటంతో పశువైద్య సిబ్బంది సమక్షంలో వైద్యశాలలో నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. వైద్యశాలలోని మరోగదికి తాళం వేసి ఉండటంతో సెలవులో ఉన్న పశువైద్యాధికారితో మాట్లాడారు. వినియోగించని మందులను గుర్తించి ఒక పెట్టెలో పెట్టి జాగ్రత్తపరిచారు. తాళం వేసిన గదిలోని మందులను రెండు రోజుల్లో తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. దీనిపై 'న్యూస్‌టుడే' డ్రగ్ కంట్రోల్ ఏడీని వివరణ కోరగా పశువైద్యశాలలో కాలం చెల్లిన మందులు నిల్వ ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేశామన్నారు. వినియోగించకుండా పక్కనపెట్టిన మందులు గుర్తించి ఒక బాక్స్‌లో జాగ్రత్త పరిచామన్నారు. తనిఖీలో కాలం చెల్లిన మందులు పెద్దఎత్తున గుర్తించినట్లు జరుగుతున్న ప్రచారం నిజం కాదని వివరించారు.

సీఎం రైతుల పక్షపాతి

తాడిమర్రి, న్యూస్‌టుడే: రైతు ప్రభుత్వమని అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వారి ఆత్మహత్యలకు కారణమయ్యారని మంత్రి సత్యకుమార్ ఆరోపించారు. గురువారం మండల పరిధిలోని నిడిగల్లు గ్రామ సమీపంలో వ్యవసాయాధికారులు ఏర్పాటు చేసిన పొలంబడి కార్యక్రమాన్ని మంత్రి సత్యకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కంది పంటలకు ప్రభుత్వం డ్రోన్ల ద్వారా మందులను పిచికారీ చేసే వ్యవస్థలను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు, మందులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని, పండించిన పంటలను సకాలంలోనే విక్రయించుకునే మార్కెట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఏడీఏలు కృష్ణయ్య, పద్మావతి, ఉద్యానవన అధికారి అమరేశ్వరి, ఏవో రమాదేవి, విహెచ్‌ఏలు రామాంజనేయులు, గౌతమి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానం.. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం

● వైద్య సేవలందక ఇబ్బందుల్లో జనం ● కొన్ని పూర్తయినా తెరుచుకోని వైనం

కదిరి, కదిరి గ్రామీణం, తనకల్లు, న్యూస్‌టుడే: అందరికీ ఆరోగ్యం లక్ష్యంతో కేంద్రం ప్రభుత్వం చేపట్టిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల సేవలు అందుబాటులోకి రాకున్నాయి. నాలుగేళ్లుగా నిర్మాణాలు జరుగుతున్నా పూర్తవక ఊళ్లోకే ఆరోగ్యం కేంద్రం వచ్చినా సేవలు దుర్లభంగా మారాయి. 3 నుంచి 5 వేల జనాభా కలిగిన ప్రాంతాలకు ఒక కేంద్రాన్ని నిర్మించి సేవలు అందించే లక్ష్యంతో 2018లో కేంద్ర ప్రభుత్వం కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా 44 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేసింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. వైకాపా పాలనలో భవన నిర్మాణాలకు గ్రహణం పట్టింది. చివరి దశ పనులున్న భవనాలు కూడా పూర్తి కావడం లేదు. ఆకతాయిలు, మందుబాబులు చేరి అసాంఘిక చర్యలకు స్థావరాలుగా ఉపయోగపడుతున్నాయి.

నిర్మాణాల స్థితి ఇలా..

కదిరి నియోజకవర్గంలో పట్నం, గాండ్లపెంట, ఎన్పీకుంట, నల్లచెరువు, తలుపుల, కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆ పీహెచ్‌సీల పరిధిలో గ్రామాలు, జనాభాకు అనుగుణంగా ఆయుష్మాన్ కేంద్రాలు మంజూరు చేశారు. ఇందులో పట్నంకు 10 కేంద్రాలు వస్తే ఐదే పూర్తయ్యాయి. గాండ్లపెంటలో 3కిగాను రెండు పూర్తయ్యాయి. మల్లమీదపల్లి ఆరోగ్య కేంద్రం గోడలకే పరిమితమైంది. కొక్కంటి పీహెచ్‌సీ పరిధిలో 11 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు వచ్చాయి. చీకటిమానిపల్లి, మల్లిరెడ్డిపల్లి ఆరోగ్య కేంద్రాలు మినహా 9 కేంద్రాలు నిర్మాణ దశల్లోనే ఆగిపోయాయి. తలుపుల పరిధిలో 7 ఆయుష్మాన్ కేంద్రాలకు 4 పూర్తయ్యాయి. 3 అసంపూర్తి పనులతో ఆగాయి. ఎన్పీకుంట పీహెచ్‌సీ పరిధి నాలుగింటిలో మూడు భవనాలు పూర్తయ్యాయి. మరొక భవన నిర్మాణం ఆగింది. నల్లచెరువు పరిధిలో మంజూరైన 8 కేంద్రాల్లో ఒకటే పూర్తయింది. మిగిలినవన్నీ వివిధ దశల్లో పనులు ఆగిపోయాయి.

నియోజకవర్గం:	కదిరి
మంజూరై ఆరోగ్య కేంద్రాలు:	44
పూర్తయిన భవనాలు:	16
అసంపూర్తి నిర్మాణాలు:	28



పునాదికే పరిమితమైన తనకల్లు-2 ఆరోగ్య కేంద్ర నిర్మాణం

పునాదులకే పరిమితమైంది

- రమణ, తనకల్లు

గ్రామీణుల ఆరోగ్య సదుపాయానికి ఆయుష్మాన్ కేంద్రం ఏర్పాటు మంచిదే. అయితే ఐదారేళ్లుగా భవనం పునాదులకే పరిమితమైంది. ఫలితంగా సిబ్బందితో స్థానికంగా ఆరోగ్య సేవలు అందటం లేదు. దీంతో చిన్నపాటి వైద్యం పొందాలన్నా సమీప పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది. కొత్త ప్రభుత్వమైనా భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజారోగ్యానికి సదుపాయం కల్పించాలి.

ఏజెన్సీల వల్లే పనుల్లో జాప్యం

- మధుసూదన్, పంచాయతీరాజ్, డీఈ, కదిరి

కదిరి నియోజకవర్గానికి 44 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు మంజూరు కాగా వాటిలో 16 నిర్మాణం పూర్తయింది. నిర్మాణం చేస్తున్న ఏజెన్సీ నిర్వహణ కారణంగా పనుల్లో ఆలస్యం జరిగింది. కేంద్రాల నిర్మాణాలను వేగవంతం చేస్తాం. త్వరలోనే భవనాలను పూర్తిచేసి సేవలు అందేలా చూస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222



సమస్య: ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన స్వచ్ఛతా మరుగుదొడ్లు నీరు లేక అధ్వానంగా మారాయి. మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **- ప్రయాణికులు**

సమాధానం: మరుగుదొడ్లకు నీటిని సరఫరా చేసే పైపులు మరమ్మతులకు గురవడంతో నీరు రావడం లేదు. వాటిని రెండు రోజుల్లో సరిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తాం.

- సత్యనారాయణరావు, ఆర్టీసీ డీఎం – న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం

ధర్మవరం : జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదల సందర్భంగా గురువారం రంగా సినీ కాంప్లెక్స్ వద్ద తారక్ చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు అంకె రామాంజి, రంగా సినీ కాంప్లెక్స్ అధినేత దేవరాజ్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. తమ అభిమాన నటుడి సినిమా విడుదల సందర్భంగా థలసీమియా బాధితుల చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని రామాంజి పేర్కొన్నారు. బత్తలపల్లి ఆర్డీటీ బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది రక్తసేకరణ చేశారు. 40 మంది దాతలు రక్తదానం చేశారు. తారక్ చేయూత ట్రస్ట్‌కు రంగా సినీ కాంప్లెక్స్ అధినేత దేవరాజ్ రూ.50 వేలు విరాళం అందించారు. రక్తదాతలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ కసిరెడ్డి సుబ్బారెడ్డి పండ్లు, రసాలు అందజేశారు. తారక్ చేయూత ట్రస్ట్ ఉపాధ్యక్షుడు వెంకీ, కార్యదర్శి నవకుమార్, ఉపకార్యదర్శి రమేష్, కోశాధికారి ముత్యాలు, ప్రధాన కార్యదర్శి తుకారాం, వేణు, గురు పాల్గొన్నారు.

ఐదేళ్లు ఏం చేశారో చెప్పే ధైర్యం ఉందా?

● ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, న్యూస్‌టుడే: మేము వంద రోజుల్లో ఏమి చేశామో ధైర్యంగా ప్రజలకు చెబుతున్నాం.. వైకాపా నాయకులు ఐదేళ్లు ఏం చేశారో చెప్పే ధైర్యం ఉందా? అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సవాల్ విసిరారు. రామగిరిలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గత వైకాపా ప్రభుత్వంలో కనీసం చిన్న రోడ్లు వేసిన పాపాన పోలేదని తెదేపా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నియోజకవర్గ వ్యాప్తంగా రూ.25 కోట్లతో రహదారులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత వైకాపా పాలనలో అర్హత ఉన్న తెదేపా సానుభూతి పరులకు సంక్షేమ పథకాలు అందకుండా చేశారని, అనర్హులకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. తెదేపా నాయకులు రామ్మూర్తి నాయుడు, రంగయ్య, సుధాకర్, పరంధామ యాదవ్, తహసీల్దార్ జమానుల్లాఖాన్ పాల్గొన్నారు.

● ప్రతి విద్యార్థికి చదువుతోపాటు క్రీడలు చాల అవసరమని సునీత అన్నారు. రామగిరిలోని పరిటాల రవీంద్ర గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆటల పోటీలను ప్రారంభించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు ఉన్నతంగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. గతంలో పరిటాల రవీంద్ర పేరుతో క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియం నిర్మిస్తే వైకాపా పాలనలో పర్యవేక్షణ లేక క్రీడా సామగ్రి మూలన పడిందన్నారు. అధికారులతో మాట్లాడి తిరిగి బాగు చేయించినట్లు తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

'వంద రోజుల్లో మంచి ప్రభుత్వం అనిపించుకున్నాం'

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రతి ఇంటికి మంచి చేయాలన్న సంకల్పంతో కూటమి పనిచేస్తోంది. వందరోజుల్లోనే మంచి ప్రభుత్వం అనిపించుకున్నాం అని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సాయినగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రజలు మంగళవాద్యాల మధ్య పూలవర్షం కురిపిస్తూ, బాణాసంచా కాలుస్తూ వారికి ఘనంగా స్వాగతం పలికారు. కూటమి అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే అభివృద్ధిలో నూతన పురోగతి కనిపిస్తోందన్నారు. చంద్రబాబుకు ప్రజల మద్దతు ఉన్నంత వరకు రాష్ట్రంలో ఆదర్శ పాలన కొనసాగుతుందని వివరించారు.

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి అభివృద్ధికి మనమంతా జవాబుదారీగా పనిచేద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం ఛైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన జరిగింది. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లు, కౌన్సిలర్లు ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. శ్రీసత్యసాయి ఆశీస్సులతో ప్రజలు ఎన్నికల్లో మనల్ని గెలించారని, ప్రతిఒక్కరూ ఒళ్లు దగ్గర పెట్టుకొని ప్రజల కోసం పని చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ ప్రహ్లాద, ప్రతిపక్ష ఫ్లోర్‌లీడర్ రత్నప్పచౌదరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, పక్కన మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

మరమగ్గాలతో కార్మికుల జీవనోపాధికి గండి



వేల్పుమడుగు వద్ద జేఆర్ శిల్క్ శారీస్ ఫ్యాక్టరీ వద్ద ఏపీ చేనేత సంఘం నాయకులు, కార్మికుల నిరసన

బత్తలపల్లి, న్యూస్‌టుడే: ధర్మవరంలో మరమగ్గాలు, జెట్‌లూమ్స్ మగ్గాల ఫ్యాక్టరీలతో చేనేత కార్మికులకు జీవనోపాధి లేకుండా చేస్తున్నారని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి మాధవస్వామి ఆరోపించారు. గురువారం ఐక్య చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బత్తలపల్లి మండలం వేల్పుమడుగు వద్ద జేఆర్ శిల్క్ శారీస్ ఫ్యాక్టరీ గేటు ముందు చేనేత కార్మిక సంఘాలతో కలిసి పెద్దఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరంలో చేనేత కార్మికులకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లను మరమగ్గాల నిర్వాహకులు అతిక్రమిస్తున్నారని, దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేల సంఖ్యలో చేనేత కార్మిక కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తోందని వాపోయారు. ప్రభుత్వాలు మారుతున్నా చేనేతలకు న్యాయం జరగలేదని తెలిపారు. మరమగ్గాలను నియంత్రించకపోతే ఉద్యమం ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. చేనేత కార్మిక సంఘం నాయకులను బత్తలపల్లి పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు, బాలకృష్ణ, జగదీష్, జిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్య, సీఐటీయూ నాయకులు రమణ, సీహెచ్ బాషా, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, మండల కార్యదర్శి వెంకటేశు, సకాల రాజా, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నిఘా నేత్రం చూపు.. నింగి, నేల వైపు..



ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో నిఘా కెమెరాలు పనిచేయడం లేదు. వాటి పర్యవేక్షణ, మరమ్మతులు పట్టించుకోకపోవడంతో నిఘా కెమెరాలు మరమ్మతుకు గురయ్యాయి. ఆసుపత్రి ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేసిన నిఘానేత్రం కిందకు ఒరిగి నేల చూపులు చూస్తోంది. ఆసుపత్రి వెనుకవైపు మార్గంలో ఏర్పాటు చేసిన మరో నిఘా నేత్రం ఆకాశం వైపు చూస్తోంది. ఆసుపత్రికి వచ్చి వెళ్లేవారి కదలికలు, అనుమానిత వ్యక్తుల రాకపోకలను పసిగట్టేందుకు ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు పనిచేయడం లేదు. ఆసుపత్రికి వచ్చి వెళ్లేవారు నిఘా కెమెరాలు పైకి కిందకు ఉండడం చూసి ఇదేం నిఘా అని ఆశ్చర్యపోతున్నారు.

– న్యూస్‌టుడే, ధర్మవరం

గుంతలుతేలి.. ప్రయాణం బేజారు



ముదిగుబ్బ నుంచి పులివెందులకు వెళ్లే మార్గంలో దొరిగల్లు దగ్గర రోడ్డు గుంతలుపడటంతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దొరిగల్లు బ్రిడ్జి దగ్గర గతంలో వర్షాలకు కొట్టుకుపోయిన ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు మళ్లీ తారురోడ్డు నిర్మించారు. నిత్యం ఈ మార్గంలో అరటిలోడు, సిమెంటు లోడు లారీలు వెళ్తుంటాయి. రోడ్డు నిర్మించి రెండేళ్లు గడవడంతో అప్పుడు కంకరకొట్టుకుపోయి గుంతలుపడింది. రోడ్డు ఎత్తుపల్లాలుగా, అధ్వానంగా మారడంతో వాహనదారులు ప్రయాణించేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వీటిపై ఆర్‌అండ్‌బీ ఇన్‌ఛార్జి ఏఈ వన్నూరుస్వామిని వివరణ కోరగా రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదించామని, నిధులు మంజూరైతే వెంటనే పనులు చేపడతామని తెలిపారు.

– న్యూస్‌టుడే, ముదిగుబ్బ

ఆరోగ్య కేంద్రమా.. అపరిశుభ్రతకు నిలయమా?



బుక్కపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగిపోయి విష కీటకాలకు నిలయంగా మారిపోయింది. నిత్యం ఎంతోమంది ఆరోగ్య కేంద్రానికి వివిధ సమస్యలపై వస్తుండగా విష కీటకాలు కనపడుతుండటంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రివేళల్లో ఆరోగ్య కేంద్రంలో విధుల నిర్వహణకు సిబ్బంది సైతం భయభ్రాంతులకు గురవుతున్నారు. పరిసర ప్రాంతాల్లో శుభ్రం చేయించాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. దీనిపై వైద్యుడు సునీల్‌ను వివరణ కోరగా రెండుమూడురోజుల్లో పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు లేకుండా శుభ్రం చేయిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, బుక్కపట్నం

ముగిసిన ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు



పరుగులో పోటీపడుతున్న బాలికలు

కదిరి, న్యూస్‌టుడే: నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు గురువారంతో ముగిశాయి. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని పాఠశాలల విద్యార్థులు అండర్-14, 17 విభాగాల్లో వివిధ పోటీల్లో పాల్గొన్నారు. రెండురోజుల పాటు క్రీడా పోటీలను జరిపారు. రెండో రోజు అథ్లెటిక్స్‌లో విద్యార్థులు పోటీపడ్డారు. ఇందులో ఆయా మండలాల్లోని పాఠశాలలకు చెందిన 1,600 మంది విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, యోగా, హైజంప్, పరుగు పందెం, తదితర విభాగాల్లో పోటీపడ్డారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఒక్కో విభాగానికి ముగ్గురి చొప్పున ఎంపిక చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను గురువారం హోరాహోరీగా నిర్వహించారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి రెండువందల మంది విద్యార్థులు క్రీడా పోటీలకు హాజరయ్యారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, బాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో బాలురు, బాలికలకు వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహించారు. గేమ్స్, అథ్లెటిక్స్‌లోని 15 క్రీడాంశాల్లో ప్రతిభ కనబరచి ప్రథమ స్థానం సాధించిన 30 మంది క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీలు తెలిపారు. ఈకార్యక్రమంలో పీఈటీలు వెంకటేశు, రామకృష్ణ, ప్రబాకర, సూరి, రామకృష్ణ, రమేష్, ఓబిలేసు తదితులు పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన బాలికలతో పీఈటీలు

నేటితరానికి స్ఫూర్తి వీరనారి ఐలమ్మ

కొత్తచెరువు, న్యూస్‌టుడే: భూమి కోసం.. భుక్తి కోసం పోరాడిన చాకలి ఐలమ్మ నేటి తరానికి తరగని స్ఫూర్తి అని రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షుడు శివప్ప, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా మహిళా కన్వీనర్ రాధమ్మ పేర్కొన్నారు. కొత్తచెరువులో చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని బీసీ కాలనీలో గురువారం నిర్వహించారు. న్యాయమైన హక్కుల సాధన కోసం ఐలమ్మ స్ఫూర్తితో సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళాలోకానికే ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా నాయకులు నాగరాజు, నారాయణ, గంగాధర, ఓబులేసు, భారతి, సాయిలీల, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

భర్తపై భార్య దాడి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: దంపతుల మధ్య చోటుచేసుకున్న వివాదంపై మాట్లాడేందుకు రావాలని ఫోన్‌చేసిన భార్య.. ఆమె తండ్రి, మరికొందరితో కలిసి భర్తపై దాడి చేసి గాయపరిచింది. బాధితుడు పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు. కదిరి పట్టణం ఆలంఖాన్ మసీదువీధికి చెందిన హయాతుల్లాకు మశానంపేటకు చెందిన సాజిదాతో మూడునెలల కిందట పెళ్లయింది. అప్పటి నుంచి భర్తను వివిధ రకాలుగా వేధించింది. ఇదిచాలదన్నట్లు ఫోన్‌చేసి పిలిచి తండ్రితో కలిసి దాడిచేసి గాయపరిచింది. స్థానికుల సాయంతో వారి నుంచి తప్పించుకున్న హయాతుల్లా కదిరి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి వివరించారు.

అదృశ్యమైన మహిళ ఆత్మహత్య

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: సోమవారం ఇంటినుంచి వెళ్లిన కదిరిపట్టణం రాధాకృష్ణావీధికి చెందిన నూర్జాహాన్ (61) కదిరి మండలం కౌలేపల్లి సమీపంలోని దేవరచెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. కదిరి గ్రామీణ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. బుధవారం దేవరచెరువులో మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బయటకు తీశారు. రాధాకృష్ణావీధికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదవ్వడంతో ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారువచ్చి గుర్తించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ మోహన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి తీవ్ర గాయాలు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని శారదానగర్‌కు చెందిన బాబయ్య, భార్గవ్ గురువారం విద్యుదాఘాతంతో గాయపడ్డారు. బాబయ్య తన ఇంటిపై షెడ్డు నిర్మించేందుకు భవన నిర్మాణ కార్మికుడు భార్గవ్‌తో కలిసి కొలతలు వేస్తుండగా 11 కేవీ కరెంటు తీగలు తగిలాయి. అతడిని రక్షించేందుకు వెళ్లే క్రమంలో భార్గవ్ కూడా గాయపడ్డాడు. వీరిద్దరినీ చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

బత్తలపల్లి, న్యూస్‌టుడే: అప్పుల బాధతో విషం తాగి చికిత్స పొందుతున్న రైతు రాజేంద్రకుమార్ (48) గురువారం మృతి చెందిన ఘటన బత్తలపల్లి మండలం మాల్యవంతంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మాల్యవంతం గ్రామానికి చెందిన రైతు గోనుగుంట్ల రాజేంద్ర ఈనెల 15న అప్పుల బాధతో మనస్తాపానికి గురై తన చీనీ తోటలో విషద్రావం తాగారు. విషయం తెలుసుకున్న పక్క పొలం రైతులు ఆసుపత్రికి తరలించారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజేంద్ర గురువారం మృతిచెందారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాల్యవంతం గ్రామానికి వచ్చి రైతు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

ప్రమాదవశాత్తు కిందపడి వృద్ధుడు..

నల్లమాడ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మసకవంకపల్లి తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు యల్లప్ప (67) గురువారం గ్రామంలో ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపి వివరాల మేరకు.. యల్లప్ప గురువారం ఆవును తోలుకొని మేపేందుకు వెళ్లాడు. గ్రామంలో ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి అండగా ఉంటానని భరోసా ఇచ్చి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా కన్వీనర్ మైలే శంకర, నాయకులు నరసింహులు, బుట్టి నాగభూషణం నాయుడు, మహేంద్రనాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోధనలో ఉపకరణాలు కీలకం

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: బోధనలో ఉపకరణాలు అంత్యంత కీలకమని రాష్ట్ర పరిశీలకులు, ఉపాధ్యాయులకు సూచించారు. ఏపీ ప్రభుత్వం పపంచబ్యాంక్ ఆర్థిక సాయంతో తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలు మెరుగు పరచుకోవడానికి సాల్ట్ ప్రోగ్రామ్ ద్వారా టీచ్ టూల్‌పై శిక్షణ ఇస్తోంది. అందులో భాగంగా గురువారం మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన, ఉపకరణాల వినియోగం, విద్యార్థుల అభ్యసన స్థాయిలపై పరిశీలన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు మల్లికార్జున, అశోక్‌నాయక్, ప్రిన్సిపల్ అమర రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం

కదిరి గ్రామీణం: బూరుగపల్లి పంచాయతీ అబ్బావాండ్లపల్లిలో గురువారం గ్రామ సర్పంచి భాస్కర్ ఆధ్వర్యంలో నాయకులు ఎన్డీయే పాలన 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం ప్రజలకు నెరవేర్చిన హామీలను ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. ఉప సర్పంచి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

కదిరి పట్టణం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన క్రీడల్లో పాల్గొన్న తమ విద్యార్థులు ప్రతిభనుచాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు బ్లూమూన్ విద్యాసంస్థల ఛైర్మన్ శివశంకర్ తెలిపారు. అండర్ -14,17 విభాగాల్లో ఖోఖోలో హర్షిత, నవ్యత, రోహిత్, దీక్షితరెడ్డి, శ్రీజరెడ్డి, వెంకటసాయి, పావని, భాను, రేవంత్, కబడ్డీలో సమీర క్రీడల్లో రాణించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు ఛైర్మన్ ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, మాధవరెడ్డి, రామాంజులురెడ్డి అభినందనలు తెలిపారు.